క్లుప్తంగా

'రత్నం'లో సైన్స్ ఎగ్జిబిషన్


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నెల్లూరు రూరల్: ధనలక్ష్మీపురంలోని రత్నం స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా స్కూల్ ఎండీ వేణుగోపాల్ మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. అనంతరం వివిధ వేషధారణలతో విద్యార్థులు అలరించారు. ఎంఈఓ తిరుపాల్, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటిక్ సంగీత కచేరి రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో కర్ణాటిక్ సంగీత గాత్ర కచేరిని సోమవారం నిర్వహించనున్నామని డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నైకు చెందిన గాయత్రి ఆధ్వర్యంలో కచేరిని నిర్వహించనున్నామని చెప్పారు.

పెయ్యదూడల ఉత్పత్తితో ఆర్థికాభివృద్ధి

కొడవలూరు : పెయ్యదూడల ఉత్పత్తి పథకం ద్వారా పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ టి.సోమయ్య తెలిపారు. మండలంలోని దామేగుంటలో పెయ్యదూడల ఉత్పత్తి పథకంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ చేసి పెయ్యదూడలను ఉత్పత్తి చేయవచ్చని, దీని వాస్తవ విలువ రూ.1,350 కాగా, ప్రభుత్వం రూ.850 రాయితీ ఇస్తుందన్నారు. పాడి రైతు రూ.500 చెల్లిస్తే లింగ నిర్ధారిత వీర్య నాళికలు ఇస్తారని, వీటిని పశువుకు రెండు పర్యాయాలు ఇచ్చినప్పటికీ చూడి నిలవని పక్షంలో రూ.500 తిరిగి రైతుకే ఇచ్చేస్తారని తెలియజేశారు. పెయ్యదూడలు పాడి రైతుకు లాభదాయకం కావడంతో ఈ పథకాన్ని ప్రభుత్వం రాయితీపై అమలు చేస్తోందన్నారు. జిల్లాలో ఆరు వేల పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యదూడలు ఉత్పత్తి చేయడం లక్ష్యంగా కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో 25 నుంచి 30 పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యదూడలు ఉత్పత్తి చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 25 మంది పాడి రైతులతో అంగీకార పత్రం తీసుకున్నారు. అనంతరం 25 పశువులకు డీ వార్మింగ్ మందులు, మినరల్ మిక్చర్ కేజీ వంతున ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం ఏడీ జి.ప్రసన్నాంజనేయరెడ్డి, పశువైద్యాధికారి ఎం.హర్షవర్ధన్‌రెడ్డి పాడి రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో సాగునీరు ఆదా

కొడవలూరు : వ్యవసాయాధికారులు సూచించే నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే సాగునీరు ఆదా చేసుకోవచ్చని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని మిక్కిలింపేట, యల్లాయపాళెం, కొత్తవంగల్లులో నీటి యాజమాన్యంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యల్లాయపాళెంలో ఆమె మాట్లాడుతూ వరిసాగు రైతులు తొలుత బురద పదునులో నాట్లు వేసుకుని వారం రోజుల వరకు 5 సెంటీమీటర్ల నీరు పెట్టుకోవాలని చెప్పారు. తరువాత దుబ్బు చేయడం పూర్తయ్యే వరకు పొలంలో పలుచగా 2 నుంచి 3 సెం.మీ నీరు పెట్టుకోవాలన్నారు. చిరు పొట్ట దశ నుంచి గింజ గట్టి పడే వరకు 5 సెంటీమీటర్ల నీటిమట్టం ఉంచాలన్నారు. కోతకు 7 నుంచి 10 రోజుల ముందు నుంచి నీటిని నెమ్మదిగా తగ్గించి ఆరబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బుచ్చి ఇరిగేషన్ ఏఈ వినయ్‌కుమార్, వీఏఏలు జి.ఉమామహేష్, సీహెచ్.వంశీకృష్ణ, డి.శివజ్ఞాన, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

విడవలూరు : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రీసర్వే ద్వారా చాలా కాలంగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభించిందని, దీంతో అనాదికాలంగా సర్కారుతోపుగా ఉంటున్న ప్రభుత్వ భూములకు అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దివంగత వైఎస్సార్ హయాంలో 60 మందికి పట్టాలు ఇవ్వగా తిరిగి మళ్లీ ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 335 ఎకరాలకు రీ సర్వే నిర్వహించి పేదలకు పట్టాలు అందజేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భవానమ్మ, ఇన్‌చార్జి తహసీల్దార్ భానుప్రకాశ్, రీసర్వే డీటీ అజీజ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్ కుమార్‌రెడ్డి, పార్టీ నేత పాశం శ్రీహరిరెడ్డి, వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అజెండాలోని అంశాలు ఆల్ పాస్

- నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం
- మొత్తం 94 అంశాలకు ఆమోదం
- సమస్యలు పరిష్కరించాలంటూ పట్టుబట్టిన కార్పొరేటర్లు
- సత్వర పరిష్కారం చూపుతామని మేయర్ స్రవంతి హామీ




మేయర్ స్రవంతి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. మేయర్ స్రవంతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి డిప్యూటీ మేయర్లు రూప్‌కుమార్‌యాదవ్, ఖలీల్ అహ్మద్, కమిషనర్ వికాస్ మర్మత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కార్పొరేటర్లు సభ దృష్టికి తీసుకొచ్చారు.

సత్వర పరిష్కారానికి హామీ

తొలుత అజెండాలోని అంశాలను సభ్యులందరికీ చదివి వినిపించాలని సెక్రటరీని మేయర్ కోరారు. ఈ క్రమంలో తమ డివిజన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ మేయర్‌ను కార్పొరేటర్లు పట్టుబట్టారు. వీటి పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆమె హామీ ఇచ్చారు. అజెండాలోని 62.. టేబుల్ అజెండాలోని 32 అంశాలు ఆల్ పాస్ అంటూ సమావేశాన్ని ముగించారు.

మేయర్‌కు వినతిపత్రాల అందజేత

సమస్యలను పరిష్కరించాలంటూ మేయర్‌కు వినతిపత్రాలను 38, 42, 17, 18వ డివిజన్ల కార్పొరేటర్లు దాసరి అమృత, కరిముల్లా, సుధాకర్, అశోక్‌కుమార్ అందజేశారు.

జగనన్న పాలనలో సంక్షేమ కార్యక్రమాలు



జగనన్న పాలనలో సంక్షేమ కార్యక్రమాలు సజావుగా అందుతున్నాయి. జగనన్న సురక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను కార్పొరేషన్ పరిధిలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

– మొయిళ్ల గౌరి, 21వ డివిజన్ కార్పొరేటర్

అర్హులకు పదోన్నతులు కల్పించాలి



డివిజన్లో పందులు, కుక్కల బెడద అధికంగా ఉంది. నగరపాలక సంస్థలో ఎంతో కాలంగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు అన్ని అర్హతలున్నా, పదోన్నతులు కల్పించకపోవడం తగదు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు తెలియజేసినా ప్రయోజనం లేదు.

– శ్రీనివాస్, 37వ డివిజన్ కార్పొరేటర్

వ్యవస్థను గాడిలో పెట్టాలి : రూప్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్



జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచేందుకు అవకాశం ఉంది. ఈ విషయమై తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపి సమస్యను పరిష్కరించాలి. కార్పొరేషన్లోని స్టోర్ రూమ్ నిర్వహణను వెటర్నరీ డాక్టర్‌కు అప్పగించడంలో ఆంతర్యమేమిటి..? నేను ఫోన్ చేసినా కొందరు అధికారులు స్పందించడం లేదు. ఇలాంటివి పునరావృతం కాకుండా వ్యవస్థను గాడిలో పెట్టాలి. నగరంలో ఉదయం సేకరించిన చెత్తను సాయంత్రానికి తరలించడం.. నగరానికి సరిపోగా, మిగిలిన తాగునీటిని కృష్ణపట్నం పోర్టుతో పాటు ఇతర అనుబంధ సంస్థలకు సరఫరా చేసే కార్యక్రమాలను త్వరలో ప్రారంభించనుండటం సంతోషకరం.

పారిశుధ్య కార్మికులను నియమించాలి



కాలువల్లో మురుగును తొలగించకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. పారిశుధ్య కార్మికులు తగినంత సంఖ్యలో లేకపోవడమే దీనికి కారణమవుతోంది. కార్మికుల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలి.

– కర్తం ప్రతాప్‌రెడ్డి, 14వ డివిజన్ కార్పొరేటర్

ఆమోదించిన ముఖ్యమైన అంశాలు

- విధి నిర్వహణలో కార్మికులు సహజంగా మరణిస్తే రూ.రెండు లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.ఐదు లక్షల చొప్పున పరిహారాన్ని బాధిత కుటుంబానికి అందించేలా తీర్మానాన్ని ఆమోదించారు.
- పారిశుధ్య కార్మికులు కోరుతున్న క్రమబద్ధీకరణ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం లభించేలా చూడటం.
- డీకేడబ్ల్యూ కళాశాల నుంచి పద్మావతి సెంటర్ మధ్యలో అబ్దుల్ కలామ్.. పొదలకూరు రోడ్డు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు ఆమోదం.
- నగరంలోని పలు డివిజన్లలో నూతన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఈ – ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు పిలవడం.. పారిశుధ్య కార్మికులకు అవసరమైన శానిటరీ పరికరాల కోసం ఆమోదం.

సమస్యలను పరిష్కరించాలి



వర్షాల కారణంగా వీధుల్లో చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను విద్యుత్ అధికారులు తొలగించి రోడ్డుపై వదిలేయడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి. కోటమిట్ట ప్రాంతంలోని షాదిమంజిల్ నిర్వహణ సక్రమంగా లేదు.

– ఖలీల్ అహ్మద్
డిప్యూటీ మేయర్

'ఓవెల్'లో ఉత్సాహంగా ఫెస్ట్



నెల్లూరు(బృందావనం): విద్యార్థుల్లోని వివిధ కళలను ప్రోత్సహించేందుకు గానూ థండర్ ఫ్లాష్ స్ప్రింగ్ ఫెస్ట్‌ను నగరంలోని పురమందిరంలో ఓవెల్ జూనియర్ కళాశాల యాజమాన్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవెల్ విద్యాసంస్థల చైర్మన్, కళాశాల ప్రిన్సిపల్ రంగిశెట్టి వేణు మాట్లాడారు. నిత్యం పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులను కళల వైపు ప్రోత్సహించడం ద్వారా వారు ఒత్తిడికి దూరమై మంచి ఫలితాలను సాధించగలరని చెప్పారు. పాటలు, నృత్యాలు, డ్రామా, స్టాండప్ కామెడీ, యోగా తదితరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ అభిషేక్ సింగంశెట్టి, ఓవెల్ విద్యాసంస్థల సీఈఓ ప్రమీల, జీఎం మహదేవన్, ఈడీ బాలు, ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రసాద్, డీజీఎం వాహబ్, ఏజీఎం గంగాధర్, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కృష్ణకుమార్, టీమ్ లీడర్స్ సుధీర్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ప్రాధాన్యమిచ్చే వారికే మద్దతు


వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు (వేదాయపాళెం): మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించే వారికే తమ మద్దతు ఉంటుందని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య మాదిగ పేర్కొన్నారు. ఏఎంసీ డైరెక్టర్ తాటిపర్తి వెంకటేశ్వర్లుకు సన్మాన కార్యక్రమాన్ని నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడారు. తాటిపర్తి వెంకటేశ్వర్లుకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్థానం కల్పించడాన్ని అభినందించారు. ఇతర నామినేటెడ్ పదవులను మాదిగలకు కేటాయించాలని కోరారు. నేతలు కుడుముల సుబ్బారావు, పాలకీర్తి రవి, పాముల హరి, నవీన్‌కుమార్, జాలాది శ్రీనివాసులు, కన్యకేశ్వరరావు, బద్దెపూడి వెంకట్రావు, తాటిపర్తి రఘు, రియాజ్, విజయ్ కుమార్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ ముందుండాలి



నెల్లూరు (పొగతోట): మహిళలు క్రీడల్లోనూ ముందుండాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. జాతీయస్థాయి అండర్ – 14 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన సుమయ ముస్కాన్‌ను నగరంలోని జెడ్పీ కార్యాలయంలో శనివారం అభినందించిన అనంతరం ఆమె మాట్లాడారు. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షాకీర్ కుమార్తె సుమయ ముస్కాన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, సీఈఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన



నెల్లూరు(బారకాసు): మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు కోరారు. కార్పొరేషన్ కార్యాలయ ఎదుట ఆందోళనను మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. కార్పొరేషన్ ప్రధాన ద్వారం వద్ద లోపలికి వెళ్లేందుకు యత్నించిన మున్సిపల్ కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సీఐటీయూ నేతలు నాగేశ్వరరావు, కిన్నెరకుమార్, సీపీఎం నేతలు కృష్ణయ్య, ప్రసాద్, షబ్బీర్, ఐద్వా నాయకురాలు పద్మ, పెంచలనరసయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శనివారంతో ముగిశాయి. స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు, హోమాలను నిర్వహించారు. ఆగమ విద్వాన్ సత్యనారాయణాచార్యులు, ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో రాజ్యాంగ దినోత్సవం



నెల్లూరు రూరల్: నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని సెట్నెల్, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చంద్రకళ, వీఆర్ కళాశాల అధ్యాపకుడు వరప్రసాద్, సెట్నెల్ అధికారి నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

లంకా దహన మహోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో లంకా దహన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నామని దేవస్థాన భక్తబృంద సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారి సన్నిధిని 1008 దీపాలతో అలంకరించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

నియామక ఉత్తర్వుల అందజేత



నెల్లూరు సిటీ: కారుణ్య నియామకంలో భాగంగా జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా మాధురిని నియమించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు శనివారం అందజేశారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని బాప్టిస్ట్ చర్చి డొనీహాల్లో ప్రీ క్రిస్మస్ వేడుకలను శనివారం నిర్వహించారు. యేసుక్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరించే సందేశాన్ని సంఘ కాపరి రెవరెండ్ శ్యామ్‌సన్‌కుమార్ అందించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. క్రిస్మస్ గీతాలను మధురంగా ఆలపించారు. సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో చండీహోమం రేపు

నెల్లూరు(బృందావనం): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిషోర్, ఉషా కుమారి దంపతులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనాలనుకునే వారు మఠాన్ని సంప్రదించాలని సూచించారు.

వ్యాసరాజ మఠంలో విశేష పూజలు రేపు

నెల్లూరు(బృందావనం): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సంతపేట బ్రాహ్మణవీధిలోని వ్యాసరాజ మఠం ప్రాంగణంలో గల రమా సహిత సత్యనారాయణస్వామి మందిరంలో విశేష పూజా కార్యక్రమాలను సోమవారం నిర్వహించనున్నామని మఠం మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు, గౌరవ కార్యనిర్వాహకుడు అర్వపల్లి సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు విశేషంగా హాజరుకావాలని కోరారు.